# పెళ్లి గడువు

-రాఘవి

బస్ కోసం ఎదురుచూస్తూ నిలబడ్డాను బస్‌స్టాప్‌లో. వాచ్‌వైపు ఒకసారి చూసి అసహనంగా కదిలాను. ఈరోజు ఫస్ట్ తారీకు కావడంతో జీతంలో నుండి కొంత అమౌంట్ అనాధ శరణాలయంలో ఇచ్చి వచ్చేసరికి లేటయింది. బస్‌స్టాప్‌లో నాతో పదిమంది దాకా ఉన్నారు.

ఈ బస్ కోసం చూస్తే చాలా లేటయ్యేలా ఉంది. ఆటో ఎక్కేస్తే... అనుకుంటుండగా "హలో" అనే పిలుపునా ప్రక్కనే వినబడడంతో అటువైపు తిరిగి చూసాను. ఎదురుగా అతను. ఒక్కక్షణం గుండె ఆగి తిరిగి కొట్టుకోవడం ప్రారంభించింది.

"బస్ కోసం వెయిట్ చేస్తున్నారా?" అడిగాడు.

నేను నిశ్చేష్టనై అతనివంకే చూస్తుండడంతో "ఏమిటి సడెన్‌గా బొమ్మలా అయిపోయారు" అన్నాడు నవ్వుతూ.

అప్పటికి నాలో చలనం ప్రారంభమయి ముఖంపైకి నవ్వు పాకింది.

"నన్ను గుర్తు పట్టారా?" అడిగాడు.

నేను తలూపాను.

"నా పేరేమిటో చెప్పండి?" అన్నాడు.

"శ్రీధర్" అన్నాను ఠక్కున.

అతను నిరాశగా చూసాడు.

అతని పేరు శ్రీధర్ కాదా? అతని పేరుకు ముందు శ్రీ వుంటుందే? అని ఆలోచిస్తున్నాను.

"నా పేరు గురించి తరువాత ఆలోచిద్దురు గానీ మీ బస్ ఇంకా రాలేదుకదా. నా బైక్‌మీద డ్రాప్ చేస్తాను రండి" అన్నాడు.

మా ఇద్దరి సంభాషణ అందరూ ఆసక్తిగా ఉంటున్నట్లు అనిపించింది. ఇబ్బందిగా ఫీలయ్యాను. అతను కూడా గమనించినట్టున్నాడు.

"రండి" అంటూ బైక్‌వైపు నడిచాడు.

వీళ్ల చూపుల బారి నుండి తప్పించుకోవచ్చునని వెళ్లాను అతని వెనుక. ఇంటికి చేరేదాకా అతను ఏమీ మాట్లాడలేదు. కానీ నా మస్తిష్కంలో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి ఇతని రాకతో.

లోపలకు వెడుతున్న నా ముఖాన్ని చూసి "మీ మూడ్ బాగోలేనట్టుంది ఈవాళ. మనం మరోసారి కలుద్దాం" అంటూ వెళ్లిపోయాడు.

లోపలకు వెళ్లి నా రూమ్‌లో బెడ్‌పై వాలాను బడలికగా.

వదిన కాఫీ తెచ్చింది.

"ఇంకా మొహం కడగలేదా? ఇక్కడ పెడుతున్నాను కాఫీ" అంటూ వెళ్లిపోయింది.

నాకు లేవబుద్ధి కాలేదు. అతని గురించి ఆలోచనలే మదిలో మెదులుతున్నాయి.

***

టీవీ చూస్తున్న నా ఎదురుగా అన్నయ్య వచ్చి కూర్చున్నాడు.

ఎందుకో వర్రీ అవుతున్నట్లుగా ఉంది అతని ముఖం. నేను తిరిగి టీవీ చూడడంలో లీనమయ్యాను.

వదిన అక్కడకు వచ్చి "ఏమిటండీ అలా ఉన్నారు?" అని అడిగింది.

"బాగానే వున్నాను" అతని సమాధానానికి వదిన చిత్రంగా చూసింది అతనివైపు.

నాకు అర్థమవసాగింది. బహుశా నా గురించే అయి ఉంటుంది. నేను సిద్ధమవ్వసాగాను.

"ఈ జన్మకి ఈవిడగారు పెళ్లి చేసుకుంటుందా లేదా?" నన్ను చూపిస్తూ వదినని అడిగాడు.

నేను ముందే ప్రిపేరై ఉండడంవల్ల "చేసుకోను" అన్నాను స్థిరంగా.

అంతే! నిప్పు తొక్కిన కోతి అయ్యాడు అన్నయ్య.

"ఎందుకు చేసుకోవు?" కళ్లల్లో నిప్పులు కురిపిస్తూ అడిగాడు. అతని చూపు తాకిడికి శక్తి వుంటే భస్మమయ్యేదాన్ని ఈపాటికి.

"నాకిష్టంలేదు"

"అదే ఎందుకు?" రెట్టించాడు.

నేను మౌనం వహించాను.

"సమీర జీవితం అలా అయ్యిందని అందరి జీవితాలు అలాగే అవుతాయా? నువ్వు చిన్న విషయాన్ని భూతద్దంలో నుండి చూస్తున్నావు" అతని కంఠంలో కాఠిన్యం క్రమక్రమంగా తగ్గసాగింది. సమీర గుర్తుకు వచ్చిందప్పుడు. అది శాడిస్ట్ భర్త మూలంగా ఎన్నో కష్టాలు పడి చివరికి ఆత్మహత్య చేసుకుందో గుర్తుకువచ్చింది. అది మా పెద్దనాన్నగారి అమ్మాయి.

"ఇప్పటికి ఎన్ని సంబంధాలు చూసాను? అందరూ ఎందుకు కుదరడంలేదని అడుగుతుంటే నాకు ఏం చెప్పాలో తోచక తల కొట్టేసినంత పనవుతోంది" అన్నాడు బాధగా.

"నాకు లేని బాధ నీకెందుకు? నాకు పెళ్లి చేసేసి ఉత్తమ సోదరుడు అవార్డు కొట్టేద్దామనుకుంటున్నాడనుకుంటా..." నాకు నవ్వొచ్చింది.

వాడి ముఖంలో ప్రశాంతత చూసి ధైర్యం తెచ్చుకుని "ఇప్పుడు మాత్రం ఏమయింది? పెళ్లి చేసుకోకపోతే నేను బ్రతకలేనా? సంతోషంగా ఉండలేనా?" అన్నాను.

"ఎందుకు బ్రతకలేవు? నాతోపాటు సమానంగా సంపాదిస్తున్నావు? ఆ ఆర్థిక స్వాతంత్ర్యం

ఉండడం వల్లనేకదా నా మాటకు విలువ ఇవ్వడంలేదు'' అన్నాడు వ్యంగ్యంగా.

"ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్న స్త్రీ అయితే ఏమిటి? మామూలు స్త్రీ అయితే ఏమిటి? తనకు నచ్చని విషయాలు ఇష్టంలేదని స్వేచ్ఛగా చెప్పే హక్కు లేదా?'' నేను విసురుగా ఏదో మాట అనేలోపు-

"చూడు గిరిజా! రేపు సుప్రదను చూడడానికి వస్తున్నారు. ఆ ఏర్పాట్లు చూడు'' అని విసవిసా నడిచి బయటకు వెళ్లిపోయాడు.


'ఇంత వాగ్యుద్ధం అందుకన్నమాట'' నీరసం ఆవహించింది నాకు.

వదిన వచ్చి నా పక్కన కూర్చుంది.

"విన్నావా... అన్నయ్య ఎంత దారుణంగా మాట్లాడాడో?'' అన్నాను బాధగా.

"మీ అన్నయ్య గురించి నాకన్నా నీకే బాగా తెలుసు. నువ్వు ఎంతకీ పెళ్లికి ఒప్పుకోకపోయేసరికి అలా మాట్లాడారు అంతే'' అంది నవ్వుతూ.

"నేను చాలా బాధపడ్డాను తెలుసా?'' అన్నాను.



"నువ్వు ఎన్ని చెప్పు సుప్రదా. పెళ్లి వద్దంటున్న కారణాలు నాకు సిల్లీగా ఉన్నాయి'' అంది.

"నీతో చెప్పిన విషయాలు అన్నయ్యకి చెప్పేసావా?'' అన్నాను కోపంగా.

"మరి ఏం చేయను? మీ అన్నయ్య అస్తమానం సుప్రద పెళ్లి ఎందుకు వద్దంటోంది అని అడుగుతుంటే చెప్పక ఏం చేయమంటావ్?'' అంది.

నా ముఖాన్ని తనవైపు తిప్పుకుని "ఇటు చూడు. సమీర జీవితం అలా ముగిసిందని, ఎదురింట్లో మీనాక్షిని అత్తమామలు రాచి రంపాన పెడుతున్నారని పెళ్లి విషయంలో ఒక అభిప్రాయానికి వచ్చేస్తే ఎలా? ఎంతమంది పెళ్లి చేసుకుని హాయిగా జీవించడంలేదు. అంతెందుకు మీ అన్నయ్య, నేను సంతోషంగా ఉండడంలేదా? నీకెప్పుడు పుస్తకాలు, కంప్యూటర్స్ తప్పితే వాళ్లకీ వీళ్లకి సహాయం చేయడం... అంతేగానీ వేరే ధ్యాసలేదు నీకు'' అంది బ్రతిమిలాడుతున్న ధోరణిలో.

"అయితే రేపు పెళ్లిచూపులు తప్పవా?'' అన్నాను దిగులుగా.

"ముందు అతడిని రానీయ్. తరువాత నచ్చకపోతే ముందు చెప్పినట్లే మీ అన్నయ్యతో నచ్చలేదని చెప్పేయ్'' అంది తేలిగ్గా వదిన.

హమ్మయ్య... సమస్య ఇంత ఈజీగా సాల్వ్ అవుతుందనే నమ్మకంతో ఊపిరి పీల్చుకున్నాను.

ఆ రాత్రి అన్నయ్య, వదిన డైనింగ్ టేబుల్ దగ్గర మాట్లాడుకుంటున్న మాటలు నా చెవిన పడ్డాయి.

"ఇంతకీ ఆ వచ్చేదెవరు?'' అడుగుతోంది వదిన.

"రాజశేఖరంగారి అబ్బాయి. పవన్ గ్రూఫ్ ఆఫ్ ఇండస్ట్రీస్ వారిదే'' చెబుతున్నాడు.

"మరి అంత గొప్ప సంబంధం ఎలా వచ్చింది?'' వదినలో కుతూహలం.

"మా నాన్నగారికీ, రాజశేఖరంగారికీ అప్పట్లో స్నేహం ఉండేదట. కొన్నాళ్లు కలసి బిజినెస్ కూడా చేసారుట. కానీ మా నాన్నగారు ఎందుకో డ్రాప్ అయిపోయారు మధ్యలో. తరువాత నాన్నగారు చనిపోవడంతో పూర్తిగా వాళ్లకు మాకు సంబంధాలు తెగిపోయాయి.

ఒకరోజు ఏదో పనిమీద మా ఆఫీస్‌కు వచ్చి అంతకుముందున్న పరిచయంతో మీ చెల్లెలిని పెళ్లి చేసుకుందామనుకుంటున్నానని, మీ అభిప్రాయం ఏమిటని అడిగాడు. అతను అలా అడిగేసరికి నేను షాకయ్యాను. అతను అందంలోనే కాదు, అంతస్థులో కూడా మనకన్నా చాలా ఎక్కువ. తరువాత అతడి గురించి ఎంక్వయిరీ కూడా చేయించాను. అబ్బాయికి ఎలాంటి దురలవాట్లు లేవు. అందుకనే సుప్రదను ఇచ్చి పెళ్లి చేయాలని నిశ్చయించుకున్నాను. ఏదో ఫార్మాలిటీ కోసం అతనిని రమ్మన్నానంతే. నువ్వు సుప్రదను ఎలా ఒప్పిస్తావో నాకు తెలియదు. అది నీ బాధ్యత అంతే'' చెప్పి లేచాడు.

నేను ఆలోచనల్లో పడ్డాను. ముందు అతన్ని రానీయ్ తరువాత చూద్దాం అనుకున్నాను.

***

ఉదయం నుండి గాబరాగా ఉంది మనసులో. వదినతో "సాయంత్రం కదా అతను వచ్చేది.

నేను ఆఫీసుకువెళ్లి ఆ టైమ్‌కి వచ్చేస్తాను'' అన్నాను.

ఏ కళనుందో వదిన సరేనంది.

అన్నట్టుగానే సాయంత్రం ఆఫీస్‌లో పర్మిషన్ తీసుకుని ముందుగానే వచ్చేసాను.

"తొందరగా తయారవ్వు. గుడికి వెళ్లాలి'' అంది వదిన తొందరపెడుతూ.

"ఇప్పుడా?'' అన్నాను ఆశ్చర్యంగా.

"అవును ఇప్పుడే. అతను ఇంటికి రాకుండా వెంకటేశ్వరస్వామి గుడిలో వెయిట్ చేస్తానన్నాడట నీకోసం'' అంది.

"ఇంటికి రావచ్చుగా'' అన్నాన్నేను అయోమయంగా.

"అతను అక్కడే బాగుంటుందన్నాడుట. నువ్వు తొందరగా తయారుకా'' కంగారుపెట్టింది.

వదిన చీర తెచ్చి ఇచ్చేలోపు నేను చుడీదార్ మార్చేసుకున్నాను. వదిన అయిష్టంగానే ఒప్పుకుంది.

"నువ్వు కూడా రాకూడదా?'' అడిగాను.


## మనస్సు మార్చుకున్న దొంగలు

ఇటీవల కెన్యాలో జరిగిన అల్లర్లలో నైరోబీ నగరంలోని ఎన్నో గుజరాతీ షాపుల్నించి ఫ్రిజ్‌లు, టీవీలు, బెడ్నులాంటి సామాన్లని స్థానికులు లూటీ చేసి పట్టుకుపోయిన సంగతి తెల్సిందే! అయితే, అలా దొంగతనం చేసిన వాళ్ళకి మంత్రగాళ్ళు చేతబడి చేసారన్న ఒక పెద్దపుకారు పుట్టిందిట. వాళ్ళు అతీంద్రియ శక్తులకి తమ ప్రాణాలు ఎక్కడపోతాయో అని చాలా మంది భయపడి తాము దొంగతనం చేసిన సామాన్లని ఆయాషాపుల ముందు దించేసి పోయారట! కారణమేదయితేనేం వాళ్ళలా చేసి తమకి శ్రమ తగ్గించినందుకు పోలీసులు సంతోషించారుట!

## ఐస్ చర్చి

రుమేనియాలో బలియా సరస్సు తీరంలో 200 అడుగుల ఎత్తైన ఐసు చర్చిని బిజినెస్ మన్ ఆర్నాల్డ్ కింగ్లిస్ నిర్మించాడట. దానికి దగ్గర్లోనే ఒక ఐదు హోటల్ని కూడా నిర్మించాడు. చాలా ప్రసిద్ధికెక్కిన ఆ చర్చిలో పెళ్ళిళ్ళులాంటి ఫంక్షన్లు చాలా జరుగుతుంటాయి. కానీ, వేడికి మంచు కరిగిపోతుందేమోనన్న భయంతో మామూలుగా చర్చిలో వెలిగించే కొవ్వొత్తులని అక్కడ నిషేధించారుట.

-విమలారామం



"నేను వస్తే అతనేమైనా అనుకుంటాడేమో? నువ్వు వెళ్లి వచ్చేయ్'' అంది వదిన.

ఆటోలో వెళ్లాను గుడికి. లోపలికి వెళ్లాక నాకు ఒక సందేహం కలిగింది. అతన్ని ముందు ఎప్పుడూ చూడలేదు. ఇప్పుడు ఎలా అతన్ని గుర్తు పట్టడం అనుకుంటూ రెండు అడుగులు వేసేసరికి నా ఎదురుగా లాల్చీ పైజామాతో ఉన్న వ్యక్తి వచ్చి నిలబడ్డాడు.

"హాయ్ మీరు సుప్రద కదూ'' పలకరించాడు.

తలెత్తి చూసిన నాకు ఇంతకుముందెప్పుడో అతన్ని చూసిన జ్ఞాపకం వేసింది.

"రండి'' అని అతను ముందుకు అడుగులు వేయగా అనుసరించాన తన్ని.

దేవుని దర్శనం అయిపోయాక కోవెలకు ప్రక్కగా వున్న మంటపంవైపు నడిచాము.

"నా పేరు శ్రీకర్. నా గురించి మీ బ్రదర్ చెప్పే ఉంటారు'' అన్నాడు ప్రస్తావనకు నాందిగా.

నా ఆలోచనలు మాత్రం వేరేచోట సాగుతున్నాయి. అది పసిగట్టినట్టు "మీరు ఇంతకుముందు నన్ను అనాధ శరణాలయంలో చూసారు'' అన్నాడు చిరునవ్వుతో.

నాకెందుకో సిగ్గనిపించింది. బహుశా నా ఆలోచనను పసిగట్టినందుకే నేమో!

అతని ముఖం చాలా ప్రశాంతంగా కనిపించింది.

"మిమ్మల్ని ఇక్కడకు రమ్మన్నానని ఫీలవ్వలేదుకదా! ఇంట్లో అందరి మధ్య ఏం మాట్లాడాలన్నా ఫ్రీగా ఉండదని ఈ ప్లేస్ సజెస్ట్ చేసాను'' అన్నాడు.

"ఫర్వాలేదు'' అన్నాను నెమ్మదిగా.

అతడు నా హాబీల గురించి, నా ఉద్యోగం గురించి అడిగి తెలుసుకు న్నాడు. తరువాత అతడి గురించి, వాళ్ల ఫ్యామిలీ గురించి చెప్పాడు.

చివరగా "నన్ను పెళ్లి చేసుకోవడం మీకిష్టమేనా?'' అని అడిగాడు.

అతనలా డైరెక్టుగా అడిగేసరికి నాకేం చెప్పాలో తోచలేదు. పచ్చి వెల క్కాయ గొంతులో పడ్డట్టుగా ఉంది. నా పరిస్థితిని గమనించినట్లుగా-

"మీకిష్టం లేకపోతే లేదని చెప్పేయండి. ఇందులో బలవంతం లేదు'' గంభీరంగా మారింది అతని స్వరం.

ఇష్టం లేదని చెబితే అన్నయ్య ఊరుకోడు. ఇతనికే ఖచ్చితంగా నా మన సులో అభిప్రాయం చెప్పేస్తే ఏ సమస్యా ఉండదు అనుకుని అతని ముఖం లోకి చూసాను.

నేనేం చెబుతానా అన్నట్లు నా ముఖంలోకి ఆతృతగా చూస్తున్నాడు.

"నాకు పెళ్లిమీద మంచి అభిప్రాయంలేదు'' అన్నాను.

అతని నొసలు ముడిపడింది.

"నాకు ఇలాగే బాగుంది. రేపు పెళ్లి చేసుకుంటే ఈ స్వేచ్ఛ, ఆనందం కోల్పోతానేమోనని భయం వేస్తోంది'' అన్నాను తల వంచుకుని.

అతను చిన్నగా నవ్వుతున్నట్లు అనిపించి తలెత్తి చూసాను.

"ఇంకా మీకున్న భయాలు చెప్పనా?'' అన్నాడు.

అయోమయంగా చూసాను నేను.

"భర్త శాడిస్టే అవుతాడేమో లేకపోతే అత్తగారు రాచి రంపాన పెడుతుం దేమో... ఇవేనా మీ భయాలు?''

ఖంగుతిన్నాను అతని మాటలకు. వదినమీద పీకలదాకా కోపమొ చ్చిందా క్షణంలో. తలూపాను చివరికి.

"నన్నూ అలాగే భావిస్తున్నారా?'' అడిగాడు.

"ఒక్కసారి పరిచయంతో ఎదుటి వాళ్ల గురించి ఏ విధంగా అంచనా వేసుకోగలం?'' ఆమాటే అన్నాన్నేను.

"నాకు మాత్రం మిమ్మల్ని పెళ్లి చేసుకోవడానికి ఎటువంటి అభ్యంతరం లేదు. నామీద మీకు నమ్మకం కలగాలంటే ఏం చేయాలి?'' అడిగాడు ఆస క్తిగా.

నేను కాసేపు ఆలోచించాను.

నాకు ఈ పెళ్లి ఇష్టంలేదన్నా నన్ను పెళ్లి చేసుకోవడానికి అతనికి ఎందుకు అభ్యంతరంలేదో నాకు అర్థమవలేదు. నాకు మాత్రం అతన్ని పెళ్లి చేసుకోవాలనిపించడంలేదు ఇంకా. ఆలోచించి చెప్పాను నా అభిప్రాయం వచ్చే సంవత్సరం ఇదే రోజున చెప్తానని.

"వ్వాట్'' అతను ఆశ్చర్యపోయాడు.

"మీకిష్టం లేకపోతే ఈలోగా ఎవర్ని పెళ్లి చేసుకున్నా నాకేం అభ్యంతరం లేదు.''



## హిట్ కాంబినేషన్...

పన్నెండేళ్ల క్రితం వచ్చిన 'ప్రేమదేశం' చిత్రం సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. కుర్రకారుని వెర్రెక్కించిన ఈ సినిమా పాటలు థియే టర్లలో వాళ్లచేత డాన్సులు చేయించాయి. డబ్బింగ్ సినిమా అయివుండీ కలెక్షన్లలో రికార్డు సృష్టించింది సినిమా. ఇందులో నటించిన అబ్బాస్-టాబు మళ్లీ ఇన్నాళ్లకి కలిసి జంటగా నటిస్తున్నారు. వీరి కాంబినే షన్‌లో వస్తోన్న తాజా చిత్రం 'ఇదీ సంగతి'. మరి నాటి విజయాన్ని ఈ జంట నేడు సాధిస్తుందా అని అంతా ఎదురుచూస్తున్నారు.



ఇలా అతన్ని వదిలించుకోవచ్చుననే ఐడియా సడెన్‌గా తట్టడంతో చెప్పేసాను.

. ఈసారి అతను ఆలోచనల్లో పడ్డాడు. నేను లేచాను.

అతను లేస్తూ "అయితే వచ్చే సంవత్సరం ఇదే రోజున మిమ్మల్ని కలుస్తాను. మీ అభిప్రాయం పాజిటివ్‌గా ఉంటుందని ఆశిస్తాను'' అన్నాడు.

నేను విస్మయంగా చూసాను. ఇద్దరం బయటకు వచ్చాం.

తన కారులో ఇంటివరకు డ్రాప్ చేస్తానన్నాడు. వద్దని సున్నితంగా తిరస్కరించాను.

పూల బండివద్ద సంపెంగలు ఉండడంతో కొనడానికి వెళ్లాను. అతను పర్సు తీస్తుండగా నేను ముందుగా డబ్బులు ఇచ్చేసాను.

నావైపు చిరునవ్వుతో చూసి "మళ్లీ కలుద్దాం" అని వెళ్లిపోయాడు.

నాకు మాత్రం నమ్మకంలేదు. అన్నయ్య, వదిన నా షరతు విని ఆశ్చర్యపోయారు.

తరువాత ఆ విషయం మరచిపోయారు. బహుశా ఈ సంవత్సరంలో అతనో రెండుసార్లు గుర్తుకొచ్చి ఉంటాడు. ఏ అమ్మాయినో పెళ్లి చేసుకునే ఉంటాడనుకున్నాను.

కానీ నా ఆలోచనలకు భిన్నంగా మరలా అతడు ఇలా కనిపిస్తాడని అనుకోలేదు.

నా ఫీలింగ్స్‌ను గమనించి "మరలా కలుద్దాం" అని వెళ్లిపోయాడు ఇబ్బంది కలిగించకుండా.

వదిన వచ్చి భోజనానికి పిలిచింది.

. "శ్రీకర్ కనిపించాడా?'' అడిగింది నవ్వుతూ.

నీకెలా తెలుసని అడిగేలోపు "నేనూ, మీ అన్నయ్యాయ మరచిపోలేదు నువ్వు పెట్టిన గడువును'' అంది.

"అవును వదినా. అప్పుడేదో అతన్ని వదిలించుకోవడానికి అలా నోటికి వచ్చింది వాగాను. ఇప్పుడు అతను కనిపించేసరికి భయమేసింది'' అన్నాను.

"ఎందుకు భయం? ఇంతకీ ఏం ఆలోచించావ్?''

"ఇంకా నేను ఏ నిర్ణయానికీ రాలేదు'' అన్నాను.

"ఒక సంవత్సరం అతన్ని వెయిట్ చేయించి ఇంకా నిర్ణయం తీసుకోలేదంటావేమిటి? ఇంకా ఎలా అయితే నమ్ముతావ్? ఈసారి నువ్వు సరైన నిర్ణయం తీసుకోకపోతే నాతో మాట్లాడడం తగ్గించు'' అని విసురుగా లోపలకు వెళ్లిపోయింది.

వదినకు కోపం రావడంతో షాకయ్యాను. అన్యమనస్కంగానే ఆఫీస్‌కి వెళ్లి వస్తున్నాను. రెండురోజులు గడిచాయి. అతని గురించి ఆలోచనలు ఎక్కువయ్యాయి. అతను 'మీ నిర్ణయం ఏమిటి?' అని అడిగితే ఏం చెప్పాలి? నాకోసం ఒక సంవత్సరం నిరీక్షించాడు. అంతకన్నా నమ్మకం ఏముంది? అతనిలో ఏ మైనస్‌లూ లేవని అంతరాత్మ పదేపదే చెప్పసాగింది. వదిన అన్నమాట గుర్తుకువచ్చింది. 'నువ్వుగానీ అతన్ని మిస్ అయితే జీవితాంతం బాధపడతావ్? అదృష్టం ఒక్కసారే తలుపు తడుతుంది'

అతనిపై మంచి కార్నర్ ఏర్పడడం మొదలవసాగింది. మళ్లీ వస్తానని చెప్పి ఇంతవరకూ అతను తనని కలవలేదెందుకో? అతను రోజులో ఏదో సమయంలో వస్తాడని ఎదురు చూడసాగాను. అయినా రాలేదు. ఈ సంవత్సరంలో లేని దిగులు, బాధ అతను కనిపించిన ఈ రెండురోజుల్లో కలగడం ఆశ్చర్యం వేసింది నాకు. ఏమిటి నా మనసు ఇంత చిత్రంగా మారిపోయింది.

★★★

ఆ సాయంత్రం మనసు బాగుండకపోవడంతో గుడికి వెళ్లాను. దేవునికి అర్చన చేయించి మెట్లపై కూర్చున్నాను. శ్రీకర్, నేను మాట్లాడుకున్న మాటలు నా చెవిలో మెదులుతున్నాయి.

ఎందుకు నా మనసు ఇంత అలజడికి గురవుతోందని ప్రశ్నించుకోగానే 'నువ్వు శ్రీకర్‌ని ఇష్టపడుతున్నావు కాబట్టి' అనే సమాధానమొచ్చింది. ఉలిక్కిపడ్డాను.


ఈ రెండురోజుల్లోనే అతను కనిపించలేదని బాధపడుతున్న నేను నన్ను ఇష్టపడిన అతను ఒక్క సంవత్సరం నాతో మాట్లాడకుండా ఎలా ఉన్నాడో? దూరంగా చెట్టుపై నుండి కోయిల కూస్తోంది.

లేచి గుడి బైటకు వచ్చాను. పూల బండివాడు నా దగ్గరకు వచ్చాడు సంపెంగపూలతో.



## సిమ్రాన్ ఆలోచన

పెళ్లి తర్వాత తెలుగులో నటించిన 'ఒక్క మగాడు' పరాజయంతో సిమ్రాన్ ఆశలన్నీ అడియాసలయ్యాయి. ఈ సినిమా విజయం సాధిస్తే మరిన్ని చాన్సులొస్తాయని భావించిన ఆమె ఇక 'జాన్ అప్పారావ్ ఫార్టీ ప్లస్' సినిమాపైనే ఆశలన్నీ వున్నాయి. అందుకనే తన రూటు మార్చాలనుకుంటోందిట. దర్శకత్వం వైపు మారాలని సిమ్రాన్ ఆలోచిస్తున్నట్టుట ఆమె సన్నిహితులు చెబుతున్నారు. అయితే సిమ్రాన్ దర్శకత్వం వహించేది సినిమాలకా లేక టీవీ సీరియల్స్‌కా అని తెలియడంలేదు.



అసలే చిరాగ్గా వున్న నేను పట్టించుకోకుండా నడవసాగాను.

"అరె... సంపెంగ పూలు కొనకుండా వెళ్తున్నారే?" నా ముందు నిల్చుని నవ్వుతూ అంటున్నాడు శ్రీకర్.

అప్పటివరకూ ఉన్న ఆందోళన పోయి తెలియని ఆనందంతో ఉద్విగ్నంతో ఊగింది నా మనసు.

"నా దగ్గర డబ్బుల్లేవు?" అన్నాను ఉన్నాసరే.

"నా దగ్గరున్నాయిగా" అన్నాడు.

నా మౌనాన్ని అంగీకారంగా తీసుకుంటూ సంపెంపపూలను కొంటుండగా "ఈ ఒక్కరోజు కొనిస్తే చాలా... జీవితాంతం కొనగలగాలి" అన్నాను ధైర్యంగా.

అతను సంతోషంతో సన్నగా విజిల్ వేసాడు.

నా చేతిలో సంపెంగపూలను పెడుతూ "ఏమిటన్నారు?" అన్నాడు.

"మీరు సరిగ్గానే విన్నారు" అని నడక వేగం పెంచాను.

***

"హలో... నా పేరు శ్రీకర్. నామీద మీకు ఒక సందేహం కలిగి ఉండ వచ్చు. ఆ సందేహం తీర్చడానికే తిరిగి రీఎంట్రీ ఇచ్చాను మీకు. అది ఏమిటంటే నేను సుప్రదనే కావాలని ఎందుకు పెళ్లి చేసుకోవాలనుకున్నాను అదే కదా. చెప్తాను. మొదటిసారిగా సుప్రదను ఎప్పుడు చూసానంటే నేను ఒకసారి అనాథ శరణాలయంకి మా కంపెనీ తరపున చెక్ ఇవ్వడానికి వెళ్లినప్పుడు ఆ అమ్మాయి కూడా విరాళం ఇవ్వడానికి వచ్చింది. చూడగానే సాఫ్ట్‌కార్నర్ ఏర్పడింది. ఆ వయసులో వున్న ఆమె సేవా గుణానికి ముచ్చటపడ్డాను. అదే ఆమెను పెళ్లి చేసుకోవడానికి కారణం కాదు కానీ అదీ ఒక కారణం కూడా. ఇంకొక కారణం ఉంది. అది ఏమిటంటే...

సుప్రద వాళ్ల నాన్నగారు కేశవరావుగారు, మా నాన్నగారు ఒకప్పుడు స్నేహితులు. మా నాన్నగారికి కేశవరావుగారు బిజినెస్‌లో ఆర్థిక సహాయం చేసారు. కొన్నాళ్లు వాళ్లిద్దరూ కలసి బిజినెస్ కూడా చేసారుట. తరువాత ఆర్థిక విషయాల్లో ఇద్దరి మధ్యా చిన్న అభిప్రాయబేధం రావడంతో ఈ బిజినెస్‌వల్ల ఇద్దరి మధ్యా శత్రుత్వం పెరుగుతుందేమోనన్న భయంతో భయంతో కేశవరావుగారు వ్యాపారం నుండి తప్పుకున్నారుట. తరువాత కొన్నాళ్లకు కేశవరావుగారు పోయారు. తరువాత నాన్నగారు, కేశవరావుగారు నుండి ఎంతో సహాయం పొందానని, కానీ తను ఆయనకు ఏ సహాయమూ చేయలేకపోయానని బాధపడేవారు.

ఒకరోజు నాతో కేశవరావుగారి కుటుంబానికి ఏదో విధంగా సాయపడమనీ, అప్పుడే తన మనస్సుకు ప్రశాంతత వుంటుందని చెప్పి తరువాత ఆయన కూడా కన్నుమూసారు.

నేను వాళ్ల కుటుంబం గురించి ఎంక్వయిరీ చేసాను. అప్పటికే అన్నాచెల్లెల్లిద్దరూ మంచి పొజిషన్‌లో ఉన్నారు. ఇతరుల నుండి సహాయం పొందే స్థితిలో లేరు. సుప్రద మళ్లీ ఇలా తారసపడడంతో నాకు ఒక ఆలోచన కలిగింది. 'ఈమెను పెళ్లి చేసుకుంటే...మా నాన్నగారి కోరిక కూడా తీర్చినట్లు అవుతుంది'. ఈ విషయమే వాళ్ల అన్నయ్యతో చెప్పాను. అతను ముందు ఎంతో సంతోషపడ్డాడు. తరువాత పెళ్లిమీద తన చెల్లెలి అభిప్రాయాన్ని చెప్పాడు.

ఒకవేళ సుప్రద ఎవరినైనా ప్రేమించి ఈ విధంగా తన వాళ్లతో అబద్ధాలాడుతోందా? అని అనుమానమొచ్చి ఆమె గురించి అబ్జర్వ్ చేసాను. కానీ సుప్రద జీవితంలో అలాంటివేంలేవు. ఆ అమ్మాయి క్యారెక్టర్ గురించి తెలుసుకున్నాక ఆమెపై ఇష్టం ఏర్పడింది. అనాథలపట్ల కరుణ వుంది, కుటుంబ సభ్యులపట్ల ప్రేమ వుంది. ఇవి చాలు సుప్రద తన కుటుంబంతో అరమరికలు లేకుండా కలసిపోవడానికి.

నేటి అమ్మాయిల్లా షికార్లు, అలంకరణలమీద ఆమెకు ఇంట్రెస్టు లేదు. డిస్కోలకు, పబ్‌లకు తిరిగే అలవాటులేదు. తను కోరుకునే అచ్చ తెలుగు పదహారణాల తెలుగమ్మాయి సుప్రద. చాలామంది అమ్మాయిల తల్లిదండ్రులు తనని తమ అల్లుడిగా చేసుకోవాలని ఇష్టపడుతున్నారు. కానీ వాళ్లల్లో లేని సుగుణాలు సుప్రదలో ఉన్నాయి. అందుకనే ఆమె కోసం ఒక సంవత్సరం కాదు ఎన్ని సంవత్సరాలైనా తను నిరీక్షించేవాడు. మీ సందేహం తీరిందికదా. ఇక వుంటాను.

మీ

సుప్రదా శ్రీకర్

★

## డబుల్ ట్రాజెడీ

ఎప్పుడో చిన్నప్పుడు విడిపోయి పెద్దయ్యాక కలిసిన కవలల కథలు సుఖాంతమవటం సినిమాల్లో చూస్తుంటాం. కాని, ఇటీవల ఇంగ్లండులో అది డబుల్ ట్రాజెడీ అయింది. హ్యూమన్ ఫెర్టిలిటీ ద్వారా పిల్లలు లేని వాళ్ళు సంతానాన్ని పొందటం గత కొన్నేళ్ళు చట్టసమ్మతమైన నేపథ్యంలో ఒకామెకు ఆడ మగపిల్లలు కవలలుగా పుట్టాక వాళ్ళని వేరే వేరే తల్లిదండ్రులు పెంచుకున్నారు. ఎవరివల్ల పిల్లలు పుట్టారో ఎవరికి పుట్టారో గోప్యంగా ఉంచటం ఇలాంటి కేసుల్లో ఒక నియమం. అయితే, యాదృచ్ఛికంగా పెద్దయ్యాక వాళ్ళిద్దరూ మరో నగరంలో కలుసుకుని ఒకర్ని చూసి ఇంకొకరు ఆకర్షితులై ప్రేమించుకుని పెళ్ళి కూడా చేసుకున్నారు. ఇద్దరిదీ ఒకరోజు పుట్టినరోజు కావటంతో కుతూహలంతో ఒకరి జన్మ గురించి ఇంకొకరు ఆచూకీ తీసుకుంటూ వెడితే జరిగిన ఘోరమేమిటో తెలిసింది. పుట్టినప్పుడు విడిపోవటం ఒక ట్రాజెడీ అయితే ఇప్పుడు నిజం తెలిసాక విడిపోవాల్సి రావటం మరొక ట్రాజెడీ. వీరి విషాదగాథ చివరికి బ్రిటిష్ పార్లమెంటులో చర్చనీయాంశమైంది. ఫెర్టిలిటీ కేసుల్లో ఎంతవరకూ గోప్యంగా ఉంచాలన్నది ఒక సమస్యగా మారింది. కోర్టుకి వెళ్ళి వాళ్ళిద్దరూ విడాకులు తీసుకున్నారన్నది వేరే సంగతి. కానీ, ఇలాంటి విషాదకరమైన సంఘటనలు మరికొన్ని జరిగాయని చారిటీ ఎడల్ట్స్ సంస్థ అధికారి పామ్ హాడ్జిన్స్ అనటం గమనార్హం!

-విమలారామం

